

# విమలాసుందరి స్వప్నాలు

## ఎన్.ఆర్.చందూర్

విమలాసుందరి అనేది ఒకే ఒక్క పేరు. విమలవేరు, సుందరివేరు అనుకునేరు – అది రైటుకాదు. విమల అనేది పుట్టింటివారు పెట్టినపేరు. సుందరి అనేది అత్తింటివారు కాక పోయినా, భర్త పెట్టిన పేరు. పెళ్ళయే దాకా విమలగా ఉన్న అమ్మాయి, మూడుముళ్ళు పడగానే సుందరిగా మారింది. 'మా అమ్మాయి విమల' అని ఒకరు చెప్పుకోగా, 'మాకోడలు సుందరి' అని మరొకరు చెప్పుకునేవారు. విమల తండ్రి తలలుమార్చి తలలుపెట్టే ప్లీడరు గనక, పెళ్ళయిన మర్నాటినుంచీ కూతురుని విమలాసుందరి అని పిలవడం ఆరంభించాడు. ఆయన పద్ధతే మిగతా వాళ్ళూ అనుసరించారు.

విమలాసుందరి తన వయసు బాలిక లందరికిమల్లేనే స్కూల్ ఫైనల్లోకివచ్చింది అప్పటి కామె వయసు పదహారు – పది హేనూ వెళ్ళి పదహారు. ఆ మార్చిలో పరీక్ష పేపర్లురాసి వచ్చింది విమలా సుందరి (అప్పటికింకా వొట్టి విమలే, సుందరి కాలేదు.) ఈ వేసంగిలోనైనా మనుమరాలికి సంబంధం చూడకపోతే, తను వురిపోసుకుంటానంది నాయనమ్మ. ఆమె అనేకసార్లు వురిపోసుకుంటానంది; ఒక్కసారి వురిపోసుకోలేదు సరిగదా, పదిన్నర అయేవేళకి పొద్దుటి భోజనం

ఏర్పాటుగాకపోతే, యిల్లుపీకి పందెర వేసేది, అంచేత, మాతృవాక్యా పరిపాలానాసక్తితో ప్లీడరుగారు తనకూతురికి పెళ్ళిసంబంధం వెతుక్కొచ్చాడనేమాట శుద్ధాబద్ధం పదహారేళ్ళ వచ్చిన పిల్లకి పెళ్ళిపేరంటాలు తన చేతిమీదుగా జరిపించడం విధ్యుక్తధర్మ మనుకున్నాడు ఆయనగారు.

విమల వివాహం నెల్లాళ్ళకి నిశ్చయమవుతుందనగా ఒక సంఘటనజరిగింది. అదేమంత ప్రత్యేక మయినదికాదు. లోకానికి సర్వసామాన్యంగా అగుపించే స్వల్పవిషయాలు, కొందరు వ్యక్తుల జీవన వికాసంలో వింతపరిణామాలు తీసుకువస్తాయి. వేసవికాలంలో ఎన్ని చోట్ల యిళ్ళు అంటుకోవు? 'దొంగలు పడిచే కొంత మిగులుస్తారు; అగ్నిహోత్రుడికి ఆ కరుణాలేదు"-అని అననే అంటారు మనవాళ్ళు. జరిగినదేమిటంటే ఒక మిట్టమధ్యాహ్నంవేళ, విమలగారింటికి అయిదారు వీధులవతల, యిళ్ళు అంటుకున్నాయి. ఆ ఊళ్ళో ఫైరింజను లేకపోలేదు. కాని, దానికోసమనిమోటారు స్ప్రింగులూ టైర్లూ తెప్పించి, తన స్వంత లారీలకు ఛెయిర్‌మెన్‌గారు ఉపయోగించుకుంటున్నారనే కారణాన, ఫైరింజనుబాగుచెయ్యడానికయేమొత్తాన్ని పురపాలకవర్గంవారు శాంక్షన్‌చెయ్యలేదు అంచేత, పేరుకంటూ ఫైరింజను ఉంది గాని, అదినడవదు_పనిచెయ్యదు. అగ్నికి వాయువు సాయం కాగా ఎన్నిబిందెలు నీళ్ళుపోస్తే మంటలారుతాయి? చూస్తూ చూస్తూ వుండగా ఏభై గడపయిట్టే కాలిపోయింది. సాయంత్రం స్కూలునుంచి వస్తూ విమలా, విమలస్నేహితులూ ఆ కాలిపోయిన కొంపల్నీ, నిరాధారంగా బయట నుంచున్న మనుషుల్నీ చూశారు.

ఆ రాత్రి విమలకి నిద్రపట్టలేదు. పన్నెండయిందీ, ఒంటిగంటయింది—నిద్రపట్టలేదు. రెండూ మూడూ కొట్టడం కూడా విమలకి తెలుసు. నాలుగుగంటల వేళ పనిమనిషి వీధి తలుపు తట్టేవేళ, ఆమెకి కాస్త కునుకుపట్టిందేమో? మళ్ళీ తెల్లారినప్పటినుంచీపిచ్చిపిచ్చిఆలోచనలే?

ఇళ్ళు కాలిపోయిన వాళ్ళందరూ ఏమవుతారు? వాళ్ళు తిరిగి ఈ జన్మకి యిళ్ళు కట్టుకోగలరా? తమ ఊళ్ళో ఫైరింజను ఎందుకు లేకపోవాలి? అసలు యిల్లు కాలేటంత అశ్రద్ధ మనిషికెందుకు ఉండాలి? ఒక పోకిరీ సిగరెట్టువిసరడం చేతనో, ఒక సోమరి బీడీఆర్పకపోవడం వల్లనో ఎందరి జీవితాలు తారుమారయాయి? - యిలాటి వెర్రి మొర్రి ఆలోచనలు.

అదంతా నిజమే. కాని ఈ యిళ్ళు కాలడానికీ తన హృదిలో ఏర్పడ్డ అశాంతికీ బంధన ఏ మూల ఉందో తెలుసుకునేపాటి వివేచనా శక్తిలేదు విమలకి. ఇళ్ళు కాలడం గురించి తన ఫ్రెండ్సందరూ మర్చిపోయారుగాని తను మర్చిపోలేకపోయింది. దానికి

కారణం ఒక్కటే, పదహారేళ్ళ ప్రాయం వరకూ విమలకి 'కష్టం' అంటే ఏమిటో తెలియదు. లోకంలో ఎంత బాధ ఉంటుందో ఊహించగలిగే అవకాశం కూడా విమలకిలేదు. తలిదండ్రులు ఎంతో గారాబంగా పెంచేవా రామెను. అలాంటిది ఒక్కనాడు, ఈ మహా ప్రమాదం చూడటంతో ఆమె మనసు చెడిపోయింది లోకంలో ఎంతో 'మిజరీ' ఉందనీ, ఆ బాధితులకు తను సాయం జెయ్యాలనీ, మానవసేవలోనే ఇహమూ పరమూ వున్నాయనీ, ఫ్లారెన్స్ నైటింగేల్ అంత తనూ అవాలనీ తల పోసింది. ఆ ఏడాది ఫ్లారెన్స్ నైటింగేల్ మీద వ్యాసం వాళ్ల స్కూల్ ఫైనల్ టెక్స్టులో ఉంది.

పై ఏడు తను యింటర్‌లో చేరుతుంది తర్వాత యం. బి తను డబ్బుకోసం ప్రాక్టీసు చెయ్యదు; ప్రజలకు సేవచెయ్య డమే తన జీవితపరమావధి. ఒకవేళ డాక్టరు కాలేకపోతే, నర్సుకాగలదుగా! నర్సుపనిలో కూడా ఎంతో ఆత్మశాంతి ఉంటుంది.

ఆ వేసంగిలో తన తండ్రి, రాఘవ రావు సంబంధం గురించి తల్లితో ముచ్చ టిస్తున్నప్పుడు, విమల కల్పించుకుని అంది:- "నాకిప్పుడు పెళ్లెందుకు నాన్న గారూ!"

"అదేమిటమ్మా, యివ్వాళ కాకపోతే రేపయినా, నిన్ను ఒక అయ్యచేతిలో పెట్టవలసిన వాళ్లమేగా!" అంది తల్లి.

"అదికాదు నాన్నగారూ, నాకు చదువుకోవాలనిఉంది. చదువుకుని ప్రజా సేవ చేస్తాను."

అమ్మాయి 'ప్రజాసేవ' అను పెద్ద మాట ప్రయోగించడం గమనించి ప్లీడరు గారు కాస్త సర్దుకునిఅన్నాడు; "అలాగే! పెళ్ళయిన తర్వాత చదువుకోకూడదని రాసి ఉందా? నిక్షేపంగా చదువుకుందువు గాని! ఆబ్బాయి చాలా మంచివాడు. నేను చెప్పినట్లు నడుచుకుంటాడు నీ కా సంశయ మేమీ అక్కర్లేదు.

"నేను పెళ్ళిచేసుకోడం ఎందుకు? పెళ్ళి చేసుకోకపోతే యేం?" అని అమాయకంగా అడిగింది విమల.

తన కూతురు ఎవరినైనా ప్రేమి స్తోందేమో కనుక్కుందా మనుకున్నాడు ప్లీడర్‌గారు. కాని ఆ ప్రశ్న వేసేందుకు ఆయనకు ధైర్యం చాలలేదు. అదీగాక తమ యింటా వంటా లేదు ప్రేమగోల. "ప్రేమేమిటి — ప్రేమ అనేది సినిమాల్లో గాని జీవితంలో ఉంటుందా?" అని తన్నుతాను సమాధాన పరచుకున్నాడు తండ్రి.

"నీకు తెలీదమ్మా. ఇలాటి మంచి సంబంధం, యింత తక్కువ కట్నంలో దొరకడం సులువుకాదు. పిల్లాడు నీకు నచ్చితేనే చేసుకొందువుగాని! ఇష్టంలేని వరుణ్ణి కడతామా? బాగోగులు మాకు తెలీవూ?"

సత్సంప్రదాయంలో పెరిగిన పదహారేళ్ల కన్య తండ్రిమాటకి ఎదురాడుతుందా? విమల ఏమీ జవాబు చెప్పలేక పోయింది. గుడ్లు వొప్పగించి తల్లినీ, తండ్రినీ అయోమయంగా చూసింది.

"నాతల్లికి రవ్వల దుద్దులుకొంటేగాని వీల్లేదు వాళ్ళు పెడతారో పెట్టరో!" అంది తల్లి.

"అలాగే!" అన్నాడు తండ్రి.

విమల అక్కడినుంచి వెళ్ళిపోయి, తనగదిలో కూచుని వెర్రిగా దిక్కులు చూడటం మొదలెట్టింది. డాక్టరీ చదివి, ప్రజాసేవ చెయ్యాలనే తన మొదటి స్వప్నం చితికిపోతున్నట్టు విమలకి తెలుసు కాని గుండెనిబ్బరంతో ముందుకి చూసింది. 'తనవాడు — తన యిల్లు' ఏర్పడతాయి. జీవితంతో బేరాలాడి లాభంలేదు; ఎవరికెంత ప్రాప్తమో, అంతే—అనుకుంది నాయనమ్మ. గదిలోకి తొంగిచూసి, 'అమ్మాయి మొహంలో పెళ్ళికళవచ్చిందే!' అన్నప్పుడు విమలకి కోపంరాలేదు సరిగదా, తనలో తాను ముసిముసి నవ్వులు నవ్వుకుంది.

*   *   *

పెళ్ళినాటిరాత్రివిమల రాఘవరావుతో తన మొదటి స్వప్నంగురించి చెప్పింది.

"ఇప్పుడు మించిపోయిన దేమిటి? నువ్వు తప్పకుండా చదువుకుందువుగాని! నేను యింజనీరూ, నువ్వు డాక్టరూ— మనిద్దరిదీ ఆదర్శదాంపత్య మవుతుంది. నేను యింకో ఆరునెలలలో డ్యూటిలో జాయినవుతాను; నువ్వుకాలేజీలో చదువుకుందువుగాని! సెలవుల్లో కలుసుకుంటూ ఉందాము" అన్నాడు రాఘవరావు.

"మీవాళ్ళు వొప్పుకుంటారా నేను చదువుకునేందుకు?" భయంభయంగా అడిగింది విమల.

"మావాళ్లెవరు వొప్పుకునేందుకూ? మానేందుకూను? అదిమనిద్దరిష్టమూను"

బంగారు పువ్వులు పూజచేసి ఉంటే గాని యింతమంచి భర్త దొరకడు—అనుకుంది విమల. అతని గుండెలమీద తన తల ఆనించి, అతని కళ్ళల్లోకి అనురాగ కిరణాలు ప్రసరింపజేసింది. అతనామెను దగ్గరకితీసుకున్నాడు. కాస్తవిడిపించుకుని మీరు సిగరెట్లు కాలుస్తారా?" అని సూటిగా అడిగింది విమల

"ఏం?" అన్నాడు రాఘవరావు మందహాసంతో.

"ఏమీలేదు."

"సిగరెట్టు వాసన వచ్చిందా?"

"లేదు లెండి." అంతే అంటుంది భారతనారి ఆ "లెండి" లోనే శతకోటి ప్రార్థనలు ఉన్నాయి.

రాఘవరావు టేబుల్ దగ్గరికి వెళ్ళి పొందాను తెరిచి, నాలుగు ఏలక్కాయలు నమిలివచ్చాడు. విమల జాలిగా నవ్వుకుంది.

"ఇంక సిగరెట్టు ముట్టను. నాకు విమల దొరికిందిగా— సిగరెట్లుఎందుకు?"

"నిజంగా సిగరెట్లు మానేస్తారా? నా కోసం మానెయ్యకండి."

విమల గెడ్డంపట్టుకు పూయించాడు రాఘవరావు.

ఒక అయిదారు నెలలపాటు విమల లోకాన్ని మర్చిపోయింది. రాఘవరావు కూడా అంతే. "అనుకూలుడైన భర్త కంటే స్త్రీ కోరదగినది ఏముంటుంది?" అనుకోసాగింది విమల. భర్తనిమించిన ఆరాధనా కేంద్రంలెదు భార్యకి. ప్రజా సేవకంటే భర్తృసేవ గొప్పదికదూ?

"వివాహో విద్యానాశాయ" అను సూత్రం విమలకి కొంతవరకూవర్తించింది "కొంతవరకు" అని ఎందుకు అనవలసి వచ్చిందంటే, వివాహం కాకపూర్వమే ఆమె స్కూల్‌ఫైనల్ పరీక్షకికూచుంది. లెక్కలపేపరు పాడుచెయ్యడంవల్ల, పరీక్షలో ఫేలయింది.

"మించిపోయినదేమిటి ప్రయివేటుగా కట్టు" అని తండ్రీ భర్తాకూడా ధైర్యం చెప్పారు.

"సెప్టెంబరుకి వద్దు, మార్చికి కట్టు; కావలసినంత వ్యవధిఉంటుంది"అన్నారు.

పరీక్ష ఫేలయినందుకు విమలఏమంత పెద్దగా విచారించలేదు. ''పెళ్ళి చదువు'' అని భర్త ఎగతాళి చెయ్యకుండా, స్కూలుఫైనల్ పాసై తీరాలనుకుంది. స్కూలుఫైనలనే యేమిటి. కాలక్రమేణా డాక్టరీ కూడాను.

డిసెంబరునాటికి రాఘవరావుకి బళ్లారి దగ్గర ఉద్యోగమయింది. అదొక ప్రాజెక్టు ఏరియా ఇన్నాళ్ళబట్టీ తన దగ్గర వుంటున్న విమలని పుట్టింటిలో దిగవిడిచి, డ్యూటీ ప్రవేశించేందుకు వెళ్లాడు. రేపు వళ్తాడనగా విమల చిన్న పిల్లమాదిరి ఏడ్చింది. తను పిడిచివుండ లేననీ, యిల్లు కుదరగానే వైరిస్తే తాను బయలుదేరి వస్తాననీ చెప్పింది.

"ఈ మూడునెలలూ కాస్త శ్రమపడి చదివితే స్కూల్‌ఫైనలయిపోతుంది" అన్నాడు రాఘవరావు.

"మీ దగ్గరవుండి చదవవలసినదే గాని, యిక్కడ వుంటే ఒక్క అక్షరం ముక్క కూడా బుర్రలోకి ఎక్కదు."

ఆరునెలల క్రితంవరకూ ముక్కూ మొహం తెలియని అమ్మాయి, అలా వెర్రి మమకారంతో మాట్లాడుతూవుంటే, మొగాడికి కళ్లు నెత్తిమీదికి రావడం సహజం. కాని చాలామందికంటె రాఘవరావు నయమే. పెళ్ళినాటి రాత్రి నుంచీ ఈనాటివరకూ సిగరెట్టు ముట్ట లేదు. విమలాసుందరి తన పాలిట భాగ్యదేవత అనుకున్నాడు.

డిసెంబరులో బళ్ళారి వెళ్ళిన రాఘవ రావు అత్తవారింటికి సంక్రాంతి కొకసారి వచ్చాడు. సంవత్సరాది కొకసారి వచ్చాడు. సంవత్సరాది కొచ్చినప్పుడు, తనకి అక్కడ యిల్లు దొరకలేదనీ, ఒకటి రెండు నెలలలో భద్రాచలం వైపుకి బదిలీ కావచ్చుననీ చెప్పాడు.



విమలాసుందరికి ఈ ఎడబాటు దుర్భరమయింది. కాని ఏమి చేస్తుంది వోర్చుకోక? రెండోసారి స్కూల్ ఫైనల్ పరీక్షకి కూచుంది. కాని ఆమె చెప్పినట్టు గానే ఈసారీ ఫేలయింది. మొదటిసారి ఫేలయినప్పుడు అంత పట్టించుకోలేదు గాని, రెండోసారి ఫేలయినప్పుడు ఆమెకి చిన్నతనం వేసింది. ఏమీ మాట్లాడలేదు గాని భర్త ఎంతగానో వోదార్చాడు.

విమలాసుందరికి కూడా కొద్దిపాటి ధైర్యం చిక్కింది. తాను డాక్టరుకానంత మాత్రాన, తనకిగాని లోకానికిగాని వచ్చిన నష్టం ఏమిటి? ఆయన యింజనీరైతే తాను డాక్టరవాలనే ఆదర్శం మంచిదే. కాని ఆ ఆదర్శం ఎండమావుల్లా ఉన్నప్పుడు? అంతకీ తన కేంలోటు? తన యింజనీరు భర్త నిర్మించిన ప్రేమ నగరానికితాను రాణి; ఆ ప్రేమనగర్‌లో రోగులూ వికలాంగులూ ఉండరు గనుక తానుడాక్టరు కాలేకపోయినా ఫరవాలేదు.

ఒకరోజు మధ్యాహ్నం జిహ్వా చాపల్యంవల్ల వేరుసెనగ వుండలు తిని, మర్నాడు వుదయం వాంతి చేసుకునే టప్పటికి, తనకడుపున కాయకాస్తోందని నాయనమ్మ ఊరంతా చాటింది. విమలకి చెడసిగ్గేసింది. తమకి యిప్పట్నుంచీ పిల్లలెందుకు? అయిదారేళ్లు పోయిన తర్వాత, పిల్లలు కావాలనే కాంక్ష యిద్దరికీ ప్రబలంగా ఉంటే, అప్పుడు కలిగినా అందం చందం. అంతేగాని, అప్పట్నుంచీ తమకి పిల్లలేమిటి?— అనుకుంది విమల.

జులైలో భర్త వచ్చినప్పుడు నాయనమ్మ చేసిన రభస చెప్పింది. అతను నవ్వుకున్నాడు.

"నేను సంపాయించేది మనిద్దరికే సరిపడదు, ఇంకా పిల్లలు కూడానా?" అన్నాడు రాఘవరావు.

అలా యిద్దరి మాటా ఒకటయే భర్త వుండగా, యింకేం కావాలి?–అనుకుంది విమలాసుందరి. ఆమె పుట్టింటిలో ఉండటం మొదలెట్టి ఏడెనిమిది నెల లయింది. నెలా రెండు నెలలూ ఐతే యిబ్బందిలేదుగాని, నెలల తరబడి పుట్టింటిలో ఉండటం ఏ స్త్రీకి హితవుగా ఉంటుంది? రాఘవరావు దసరాకి వచ్చి నప్పుడు తనను వెంట తీసుకువెళ్లమని మంకుపట్టు పట్టింది విమలాసుందరి

అది పొట్టిమన్యప్రదేశం. నీఆరోగ్యం చెడిపోతుందేమోనని భయంగా ఉంది. కాదు కూడదంటే, తీసుకువెళ్తాను. ఇక్కడ బావుండకపోతే, మా అమ్మా నాన్నా దగ్గరికివెళ్ళి ఉండు'' అన్నాడు రాఘవరావు.

"నేనెక్కడా ఉండను. మీ దగ్గరే ఉండాలి. మీకు రాని మలేరియా నాకు వస్తుందా? వస్తే రానివ్వండి" అంది విమలాసుందరి.

"నీ యిష్టం. సులువు బలువులు చెప్పాను. అయితే, రేపే వెళ్దాం" అన్నాడు రాఘవరావు.

భద్రాచలానికి ముప్పైమైళ్లదూరంలో ఉంది రాఘవరావు పనిచేస్తున్న ప్రాజెక్టు. ఇంజనీరింగ్‌స్టాఫ్ కోసమే ఆ కాలనీ ఏర్పడింది. కాలనీపక్క ఒక కుగ్రామం ఉందిగాని అక్కడ కావ్‌స్టన్ సిగరెట్లు కూడా దొరకవు. ఎనమండుగురు ఇంజనీర్లు, ఇద్దరు పెద్ద పెద్ద ఇంజనీర్లు, ముప్పై, నలభైమంది మేస్త్రీలు, నాలుగైదు వందలమందికూలీలూపనిచేస్తున్నా రక్కడ. ఏడుమైళ్లదూరంనుంచి ఎలక్ట్రిసిటీ తీగెలు ఈ కాలనీకోసమని పట్టుకొచ్చారు. లారీలూ, ట్రక్కులూ, జీపులూ విరామం లేకుండా తిరుగుతూ ఉంటాయి కొందరు కుటుంబాలతో ఉన్నారు; మరి కొందరు రికామీగా ఉన్నారు. అక్కడ ఉన్న యిళ్లన్నీ పాకలు.

విమలాసుందరికి మొదటి నాలుగైదు రోజులూ తమాషాగా ఉందిగాని ఆ పైన తనకి తోచటంలేదంటూ కీర్తన ప్రారంభించింది. రెక్కలమ్ముకున్నరాఘవరావు ఏంచెయ్యగలడు? పొద్దున్న ఎనిమిదింటికి వెళ్తే, మధ్యాహ్నం పన్నెండు గంటలకి వస్తాడు. రెండుగంటలకి వెళ్తే, సాయంత్రం ఆరింటికి వస్తాడు. సినిమా అనేది చుట్టుపట్లలేదు. ఇవాళటి పేపరు రేపు మధ్యాహ్నం నాలుగు గంటలకి వస్తుంది. రేడియోమాత్రం ప్రతి యింజనీరు ఇంట్లోనూ ఉంది.

విమలాసుందరి మిగతా యింజనీరుల భార్యలతో పరిచయం చేసుకుంది. ఒకావిడ నలుగురు పిల్లలతల్లి; యింకో ఆవిడ రోగిష్టి మనిషి; మరొక ఆవిడ సీతాకోకచిలుక. ఏమయితేనేం, ఏ ఒక్కరితోటీ విమలాసుందరికి పొసగలేదు.

"ఏమండీ, మనంఎల్లకాలం యిక్కడ వుండవలసిన వాళ్ళమేనా?" అంది రాఘవరావుతో విమలాసుందరి.

"నీకిక్కడ పొద్దుపోదని నాకు తెలుసు. అందుకనే రావద్దని వారించాను."

"పెళ్ళిచేసుకున్న తర్వాత ఏ ఆడ దానికైనా 'నాయిల్లు' అనేది ఒకటి ఉండాలనిపిస్తుందిగా!"

"అలా మాట్లాడుతున్నావేంయివ్వాళ" అన్నాడు రాఘవరావు.

ఆ రోజు భార్యాభర్త లిద్దరూ కీచులా డుకున్నారు. రెండు రోజులదాకా ముఖం విప్పి మాట్లాడుకోలేదు ఒకరితో ఒకరు. కాలం గడిచిన కొద్దీ కీచులాటలు కూడా కొంచెం కొంచెం అలవాటై పోయాయి.

"ఇంకోచోటికిమీరు బదిలీచేయించుకో కూడదూ?"

"అదిమనచేతుల్లో ఉన్నపనిగాదు."

"అసలు మీకు యిక్కడేబావుంది."

అలాదెప్పడం విమలాసుందరి తెలివి హీనతకి తార్కాణం. విమలాసుందరి స్వప్నాలు కరిగిపోతున్నాయంటే, అందుకు కారణం రాఘవరావు కాదు కాని. అయినదానికీ కానిదానికీ అతన్ని అంటూవుంటేగానివిమలకితృప్తిఉండదు.

రాఘవరావు మననుకి ఎంత నొప్పి కలిగితే, ఆమె ప్రాణానికి అంత హాయి. సైకాలజిస్టులు దీనిని ఒక రకం శాడిజమ్ అంటారు.

ఏమయితేనేం, నాలుగు నెలల అనంతరం విమలాసుందరి పుట్టింటికి తప్పనిసరిగా వెళ్లవలసి వచ్చింది. నాయనమ్మ వెనక అన్నమాట యిప్పుడు నిజమయింది. విమలాసుందరి కడుపున ఒక ఆడపిల్ల కాసింది. ఆ ఆడపిల్లకి పెళ్ళీడు వచ్చేదాకా గూడా నాయనమ్మ బతికివుండి, ఉరిపోసుకుంటానని మళ్ళీ బెదిరించడం మట్టుకు నిజం.

అక్కరలేనిపిల్ల అని భర్తతో అన్న ప్పటికీ లోకంతో అనలేదు విమలా సుందరి. పిల్లని చూసుకు ఒక రెండు నెలలపాటు మురిసిందేమో ఆమె! ఆ పిల్ల కూడా అలవాటై పోయింది. ఎంతటి మాధుర్యమైనా సరే, అలవాటైపోవడం లోకధర్మం. రాఘవరావు జీతంలో పెద్ద యింక్రిమెంటు లేకపోయినా, విమలా సుందరికి మరొక ఆడపిల్ల కలిగింది. వివాహమై అయిదేళ్లు గడవకుండా, ముగ్గురు పిల్లల తల్లిఅయి కూచుంది విమలాసుందరి. భర్తమీద కసికొద్దీ ఈ పిల్లల్ని కన్నదా!—అనిపిస్తుంది.

ఉంగరాలు ఉంగరాలుగా సిగరెట్టు పొగని వెప్పిస్తూ, "మీ అమ్మ డాక్టర్ అవుదామనుకుంది" అని రాఘవ రావు పెద్దకూతురుతో జోక్ చేస్తున్నప్పుడు కూడా విమలాసుందరి చలించదు.

ముగ్గురు పిల్లల తల్లిఐన విమలా సుందరికి లోకంమీద క్రోధం, ప్రజల పట్ల అసహనం, ఎవరిని చూసినా చీకాకే! ఇక భర్త సంగతి చెప్పనే అక్కర్లేదు; అతన్ని మింగేద్దామన్నంతకసి. అయిదు దీర్ఘ సంవత్సరాలలో ఆమె స్వప్నాలన్నీ నేల రాలాయి. అందుకు కారణం రాఘవ రావు మట్టుకు కాదు. విమలాసుందరి స్వప్నాలు గాలిలో దీపాల్లాంటివి; అవి ఆరిపోక ఏంచేస్తాయి?

*